

3న జాబ్‌మేళా

శ్రీకాకుళం అర్బన్ : జిల్లా ఉపాధిశాఖ ఆధ్వర్యాన పదో తరగతి నుంచి పిజి వరకు విద్యార్హత కలిగి 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు గల నిరుద్యోగ యువతకు ఈ నెల 3న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.బి.సాయిశ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ కల్పనలో భాగంగా ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ మేళాలో 9 కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలను నిర్వహిస్తారని చెప్పారు. ఆరు కంపెనీల్లో వికలాంగులకు మాత్రమే నియామకాలు చేపడతారన్నారు. అర్హత కలిగిన నిరుద్యోగ యువత వారివారి విద్యార్హత పత్రాలతో పాటు సదరం ధ్రువపత్రం, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో పాటు 3 బయోడేటా పత్రాలు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరు కావాలన్నారు. వివరాలకు 9550967353, 8317652552 సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు. రిజిస్ట్రేషన్ కోసం skilluniverse.apssdc.in వెబ్‌సైట్‌ను సందర్శించి రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

తుపానుపై అప్రమత్తం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా మారి శనివారం అర్ధరాత్రి తీరం దాటనుండటంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ముందస్తు చర్యల్లో భాగంగా కలెక్టరేట్‌లోని ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నుంచి జెసి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌తో కలిసి శనివారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకొని, తుపాను ప్రభావాన్ని ఎదుర్కోవడానికి యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని తెలిపారు. తీర ప్రాంత మండలాల్లో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా దండోరా వేయించామని అన్నారు. అన్నిశాఖల అధికారులు ఎప్పటికప్పుడు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. నాగావళి, వంశధార ప్రధాన నదీ పరివాహక ప్రాంతాల్లో యంత్రాంగం అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా, మండల, గ్రామస్థాయి అధికారులు, సిబ్బంది అందరూ అందుబాటులోనే ఉన్నారని అన్నారు. జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్‌ని ఏర్పాటు చేశామని, తుపాను, ఇతర భారీ నష్టాలకు సంబంధించిన ఏదైనా సమాచారం ఉంటే కంట్రోల్ రూమ్ నెం:08942-240557కు ఫోన్ చేయాలన్నారు. అలాగే ఈమెయిల్ ఐడి cosklm-supdtd@gmail.com ద్వారా ఫొటోలను పంపించాలని తెలియజేశారు. 08942-240557 నంబరుకు అత్యవసర సమయంలో ఫోన్ చేయాలని, సిబ్బంది వెంటనే అప్రమత్తమై తగు సహాయం చేస్తారని అన్నారు. అవసరమైన సామగ్రి సిద్ధం చేసుకోవాలని తహశీల్దార్లకు సూచించారు. వైద్య-ఆరోగ్య శాఖ, విద్యుత్, రహదారులు భవనాలు, ఎస్ఇఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు సిబ్బంది కచ్చితంగా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అవసరమైన మందులను సిద్ధం చేసుకోవాలన్నారు. విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్ స్తంభాలు ఇతర సామగ్రితో తుపాను ప్రభావిత మండలాల్లో సిద్ధంగా ఉన్నారన్నారు. జిల్లాలో 108 వాహనాలు, ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌టిఆర్‌ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచామని వివరించారు. జనరేటర్లను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్లను ఆదేశించామన్నారు.



సమీక్షిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రత్యేక అధికారులు వీరే

తుపాను హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలోని 11 తీర ప్రాంత మండలాలకు పర్యవేక్షక అధికారులను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరితో పాటు జిల్లాలోని 30 మండలాల్లో తహశీల్దార్‌లను వారి వారి మండలాల్లో అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అప్రమత్తం చేశారు. తీర ప్రాంత మండలాలైన రణస్థలానికి కొవ్వాడ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మణమూర్తి (9121251111), ఎచ్చెర్లకు డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు (8790008399), శ్రీకాకుళం మండలానికి జెడ్‌పి సిఇఒ డి.వెంకటేశ్వరరావు (9100997770), గారకు ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ (9440814582), పొలాకికి డిపిఒ ఆర్.వెంకటరామన్ (8919364818), సంతబొమ్మాళికి వంశధార యూనిట్-4 ప్రత్యేక అధికారి జె.వి.ఎస్.రామ్మోహనరావు (9440422302), వజ్రపు కొత్తూరుకు జిల్లా పరిశ్రమలశాఖ మేనేజర్ ఉమామహేశ్వరరావు (9866530885), మందసకు జిల్లా కో-ఆపరేటివ్ అధికారి బి.నగేష్ (7093930101), సోంపేటకు మైన్స్ డిడి ఎస్.కె.వి.సత్యనారాయణ (9502225511), కవిటికి ఉద్యానవన శాఖాధికారి ఆర్.వి.ప్రసాద్ (7995086758), ఇచ్ఛాపురం మండలానికి డ్వామా ఎపిడి సిహెచ్.శ్రీనివాస్‌రెడ్డి (6309998070)లను తుపాను పర్యవేక్షక అధికారులుగా నియమించారు. వీరు ఆయా మండలాల్లో రాబోయే మూడు రోజులు పాటు తుపాను, భారీ వర్షాలు తదనంతర పరిణామాలను పర్యవేక్షిస్తారు. తహశీల్దార్ కార్యాలయం, సంబంధిత సెక్రటేరియట్లు స్థానికంగా కంట్రోల్ రూమ్‌లను 24/7 ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో విఆర్‌ఒలు, ఇతర క్షేత్ర స్థాయి సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. సంబంధిత మండలాల్లో ఏర్పాటు చేసిన తుపాను షెల్టర్లు, పునరావాస కేంద్రాలను సందర్శించి అవి ఉపయోగకరంగా ఉండేలా చూడాలన్నారు. వాటిలో అవసరమైన ఆహార ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

అధికారులు అందుబాటులో ఉండాలి

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి: శ్రీకాకుళం జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్న సందర్భంగా అన్నిశాఖల అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. మండలంలోని నిమ్మాడలో తన కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఆదివారం అధికారులకు సెలవు అయినా... ప్రజల రక్షణ కోసం జిల్లావ్యాప్తంగా వైద్య, ఆరోగ్య, విద్యుత్, వ్యవసాయ, పంచాయతీ, రెవెన్యూ, పశు సంవర్ధకశాఖలతో పాటు అన్నిశాఖల అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. జిల్లా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల భద్రతే మన బాధ్యత అని చాటిచెబుదామని పిలుపునిచ్చారు. ప్రజలు కూడా అవసరమైతే తప్ప బయటకు రాకూడదని అన్నారు.

మహిళలకు రక్షణ కరువు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

దేశవ్యాప్తంగా మహిళలకు రక్షణ కొరవడిందని, ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా వాటి అమలులో చిత్త శుద్ధి లేక యథేచ్ఛగా దాడులు జరుగుతున్నాయని పలువురు వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో ఐద్వా ఆధ్వర్యాన శనివారం మహిళల భద్రత అన్న అంశంపై సదస్సు నిర్వహించారు. ముందుగా మహిళా ఉద్యమ నేత వాడపల్లి లక్ష్మి 33వ వర్ధంతి సభ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఐద్వా జిల్లా కన్వీనర్ అల్లాడ లక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ప్రభుత్వ బాలికల హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎం.వాగ్దేవి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలపై హింస రోజురోజుకీ పెరుగుతుందే తప్ప తగ్గడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు చట్టాలు చేస్తున్నా, వాటిని పటిష్టంగా అమలు చేయడం లేదని అన్నారు. దేశంలో సగటున రోజుకి 86 మంది మహిళలు హింసకు గురవుతున్నారని ప్రభుత్వ గణాంకాలే చెప్తున్నాయన్నారు. చిన్నప్పటి నుంచి లక్ష్మి జీవనశైలిని చూస్తూ... పెరడం వల్లే పోరాడేతత్వం అలవర్చు కున్నారని అన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శంకర్‌నారాయణ మాట్లాడుతూ సరళీకరణ, ప్రయివేటీకరణ విధానాల వల్ల అసమానతలు పెరిగాయన్నారు. ఈ అసమానతలను తొలగించడానికి స్త్రీ, పురుష సమానత్వం ఇంటి నుంచే మొదలవ్వాలని పిలుపు నిచ్చారు. సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ కె.శ్రీవాసు మాట్లాడుతూ మాదకద్రవ్యాలు, అశ్లీల సాహిత్యం, పోర్న్ వీడియోల ప్రభావం తీవ్రమై సమాజంపై చూపుతోందన్నారు. ఈ ప్రభావాన్ని అరికట్టడంలో ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయన్నారు. సమస్యలపై యువతరం ప్రశ్నించకుండా వాళ్లను పక్కదారి పట్టిస్తున్నాయన్నారు. లక్ష్మి మాట్లాడుతూ సామ్రాజ్యవాద విష సంస్కృతి నుంచే మహిళని అణచివేసే ధోరణి పెరుగుతోందన్నారు. స్త్రీ స్వతంత్ర మర్హతి అనే మనువాద భావజాలంతో ఉన్న పాలకుల విధానాల వల్లే భారతీయ మహిళ రెండో తరగతి పౌరురాలిగా పరిగణిస్తున్నారని అన్నారు. శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కె.నాగమణి మాట్లాడుతూ పనిప్రదేశాల్లో మహిళలపై లైంగిక దాడులు తీవ్రతమవుతున్నా... పాలకులు పటిష్ట చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇలాంటి నేపథ్యంలో సంఘటిత పోరాటాల ద్వారానే మహిళలు తమకు తాము రక్షించుకోగలరని తెలిపారు. పెరుగుతున్న విష సంస్కృతి మహిళలపై ప్రభావం అనే వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అందులో గెలుపొందిన విజేతలకు వైస్ ప్రిన్సిపాల్ శంకర్ నారాయణ బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం జిల్లా అధ్యక్షులు వి.జి.కె.మూర్తి, ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కన్వీనర్ పి.పవిత్ర, ఐద్వా నగర కమిటీ సభ్యులు ఆణిపులత, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.


చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న వాగ్దేవి, తదితరులు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిఇఒ తిరుమలచైతన్య

'చెకుముకి'ని విజయవంతం చేయాలి

డిఇఒ తిరుమల చైతన్య

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన నిర్వహించనున్న చెకుముకి సైన్స్ సంబరాలను విజయవతం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.తిరుమల చైతన్య పిలుపునిచ్చారు. డిఇఒ కార్యాలయంలో చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సంబరాలు జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ట్రైబల్ వెల్ఫేర్, మోడల్ స్కూళ్లు, కెజిబివి, ఎయిడెడ్, ప్రయివేట్ విద్యాలయాల ప్రిన్సిపాళ్లు, హెచ్‌ఎంలు, ఎంఇఒలు సహకరించి విజయవంతం చేయాలన్నారు. జెవివి రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో సెప్టెంబరు 25న, మండలస్థాయిలో అక్టోబరు ఒకటిన, జిల్లాస్థాయిలో అక్టోబరు 27న, రాష్ట్రస్థాయిలో నవంబరు 9, 10 తేదీల్లో చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వాటిలో అన్ని పాఠశాలల్లోని 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ లియాఖత్ ఆలీఖాన్, హెడ్ మాస్టర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వి.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి యర్నాగుల వాసుదేవరావు, ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.వెంకటేశ్వర్లు, మ్యాథ్స్ ఫోరం జిల్లా అధ్యక్షులు కందుల అశోక్, జీవశాస్త్ర ఉపాధ్యాయ ఫోరం అధ్యక్షులు పుట్టా ఉదయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పూజారి గోవిందరావు, మండల విద్యాశాఖాధికారులు పేడాడ దాలినాయుడు, రామకృష్ణ, త్రినాథరావు, మజ్జి మురళీకృష్ణ పాల్గొన్నారు.

వీల్‌చైర్లు అందుబాటులో ఉండాలి

'ప్రజాశక్తి' కథనానికి స్పందించిన మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ప్రభుత్వాస్పత్రిలో వీల్‌చైర్లు, లిఫ్ట్ తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూపరింటెండెంట్ సూర్యారావును ఆదేశించారు. ఆగస్టు 30న 'ఆస్పత్రి సిబ్బంది తీరు మారదా?' అనే కథనం 'ప్రజాశక్తి'లో ప్రచురితమైంది. దీనిపై మంత్రి స్పందించి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై వైద్యులకు అడిగి తెలుసుకున్నారు. ఓపి విభాగం విభాగానికి వెళ్లి రోజుకి ఎంతమంది రోగులుస్తున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుర్చీలు, తాగునీరు, తక్షణమే సమకూర్చాలని ఆదేశించారు. వైద్యులు అందుబాటులో ఉండాలని, బాధ్యతగా పనిచేయాలని సూచించారు. తక్షణమే లిఫ్ట్, వీల్‌చైర్లు అందుబాటులో తేవాలని ఆదేశించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. గతంలో తాను ప్రారంభించిన శిలాఫలకాలు తొలగించారని, తక్షణమే ప్రోటోకాల్ ప్రకారం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆస్పత్రిలోని రోగులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు


ప్రశ్నిస్తున్న వైస్ చైర్‌పర్సన్లు స్వర్ణమణి, భారతీదివ్య
(ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి)

చైర్‌పర్సన్ X వైస్-చైర్‌పర్సన్లు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో రోడ్డు విషయంపై చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అది కాస్త వ్యక్తి గత దూషణలకు దారితీసింది. ఒకరినొకరు ఏకవచనాలతో విమర్శలు చేసుకున్నారు. దీంతో కౌన్సిల్ హాల్ అంతా గందరగోళంగా మారింది. ముందుగా మున్సిపాలిటీ పరిధిలోని 16 వార్డులో ఉన్న పకీరుపేట రోడ్డు పనులు అర్ధాంతరంగా నిలిపి వేయడంపై వైస్ చైర్‌పర్సన్లు లాభాల స్వర్ణమణి, ఉల్లాల భారతీదివ్య అధికారులు తీరుపై మండిపడ్డారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అధ్యక్షతన శనివారం కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఇచ్ఛాపురం పర్యటనలో భాగంగా ఈ ఆగస్టు 30న పకీరుపేటలో రూ.10 లక్షలతో సిసి రోడ్డు పనులకు భూమి పూజ చేయాల్సి ఉండగా, ఎందుకు వాయిదా వేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. వార్డు ప్రజలు రోడ్డు భూమి పూజ కోసం ఎదురు చూస్తుండగా, ఎవరికీ చెప్పకుండా వాయిదా వేయడం సరికాదన్నారు. ప్రజా ప్రతినిధులకు ఇచ్చే గౌరవం ఇదేనా? అని నిలదీశారు. కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేశామని కమిషనర్ రమేష్‌కు మద్దతుగా చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి సమాధానం చెప్పారు. దీంతో వీరి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. అనంతరం మూడేళ్లుగా రోడ్డు కోసం పోరాడుతుంటే ఇప్పటికీ మోక్షం కలిగిందని, దీనినీ రాజకీయ కక్షతో రోడ్డు పనులు నిలిపి వేయటం దారుణమని అధికారుల తీరుపై మండిపడ్డారు. త్వరలోనే పనులు చేపడతామని చైర్‌పర్సన్ చెప్పటంతో గొడవ సర్దిమనిగింది. ఎజెండాలో పొందుపరిచిన పది అంశాలపై చర్చించారు. ఉన్నచోట కాలువల్లో షిల్ట్ తొలగించకుండా వేరేచోట తొలగించటంపై, అన్న క్యాంటిన్ పనులు నామినేషన్ పద్ధతిలో పనులు చేయటంపై స్వర్ణమణి అభ్యంతరం వ్యక్త చేస్తూ వినతిపత్రం అందించారు. మున్సిపాల్టీలో పేరుకు పోయిన 400 కుక్కలను పట్టించి వ్యాక్సిన్ వేసేందుకు రూ.1500 చొప్పున రూ.6 లక్షలు కేటాయించి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. కానీ, కౌన్సిల్ సభ్యుల్లో ఐదుగురిని కమిటీ వేయించి వారి పర్యవేక్షణలో కుక్కలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలలని కోరారు. గతంలో కోతులు పట్టేందుకు నిదులు కేటాయించారని, కానీ, పూర్తి స్థాయిలో నివారించలేదన్నారు. బాహుదానది వద్ద శ్మశాన వాటికలో కాటికాపరిని నియమించాలని, అక్కడా లైట్లు, తాగునీటి సమస్య లేకుండా చేయాలని, పిచ్చి మొక్కలను తొలగించాలని టిడిపి కౌన్సిలర్ ఆశి లీలారాణి కోరారు.

మున్సిపల్ స్టాండింగ్ వకీలుగా రాంబాబు

ఇచ్ఛాపురం మున్సిపల్ స్టాండింగ్ వకీలుగా న్యాయవాది ఎం.రాంబాబును మెజారిటీ వార్డు కౌన్సిలర్లు ఎన్నుకున్నారు. బార్ అసోసియేషన్ నుంచి ఐదుగురు న్యాయవాదులు అల్లాడ నారాయణరావు, నాగరాజుపాత్రో, జీరు కామేష్, అనపాన భైరాగిరెడ్డి, మొగల్లా రాంబాబులు దరఖాస్తులు చేసుకున్నారు. దీంతో చైర్‌పర్సన్, కమిషనర్, కౌన్సిలర్లు స్టాడింగ్ కౌన్సిల్ సభ్యుడుగా రాంబాబును ప్రకటించారు.

తమ్ముళ్లకు భరోసా... జనానికి నిరాశ

వీక్షణం

ప్రజాశక్తి-శ్రీకాకుళం ప్రతినిధి

టిడిపిని ఆదరించి నన్ను గుండెల్లో పెట్టుకున్న ప్రజల రుణం తీర్చుకుంటానని ఎన్నికల ముందు చెప్పిన చంద్రబాబు ప్రస్తుతం కార్యకర్తల రుణం తీర్చుకునే పనిలో ఉన్నట్లు కనిపిస్తోంది. కార్యకర్తలకు నిధులు సమకూర్చడం, నామినేటెడ్ పోస్టుల భర్తీతో వారికి ఆర్థిక భరోసా కల్పించే పని మొదలు పెట్టారు. 2014-19 కాలంలో టిడిపి హయాంలో చేపట్టిన నీరు-చెట్టు పనులకు బిల్లులు చెల్లింపులు మొదలు పెట్టింది. జిల్లాలో ఎంత మొత్తంలో పనులు జరిగాయి, ఎన్ని బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయనే లెక్కలు తీసి అధికారులు చెల్లిస్తున్నారు. గతంలో నీరు-చెట్టు పనులన్నింటినీ టిడిపి నాయకులే చేపట్టారు. తుది విడతలో చేపట్టిన పనులకు సంబంధించి కోట్లాది రూపాయలు పనులు చేసినా చాలా మందికి బిల్లులు చెల్లించలేదు. బిల్లులను పెండింగ్‌లో పెడితే వాటి కోసం రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తారన్న అంచనాతో నాటి చంద్రబాబు ప్రభుత్వం బిల్లులు ఆపేయడం, ఆ తర్వాత 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం చెల్లింపులకు నిరాకరించడంతో కార్యకర్తలకు ఆర్థికంగా కోలుకోలేని దెబ్బతీసింది. అప్పులు చేసి కోట్లాది రూపాయలను మదుపులు పెట్టిన తమను చంద్రబాబు నిండా ముంచారని మొన్నటి వరకు తెలుగు తమ్ముళ్లు తిట్టుకున్నారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తమ పెండింగ్ బిల్లులకు ఇక ఢోకా ఉండదని భావించారు. కార్యకర్తలు పెట్టుకున్న ఆశలకనుగుణంగానే ప్రభుత్వమూ ఆ ఫైల్‌ను నడిపింది. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, బిల్లుల అంశాన్ని తొలి నుంచి పర్యవేక్షిస్తున్న పార్టీ నేత బీద రవిచంద్ర, ఇంజినీరింగ్ ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి డబ్బులు చెల్లింపులపై నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.695 కోట్లు బకాయిలు ఉండగా, తక్షణ చెల్లింపులుగా రూ.259 కోట్లను విడుదల చేసి చెల్లింపులు మొదలు పెట్టారు. నీరు-చెట్టు పనుల్లో అవకతవకలు చోటు చేసుకున్నాయని, పనులు చేయకుండానే బిల్లులు పెట్టారంటూ ఆరోపణలు రావడంతో గత వైసిపి ప్రభుత్వం విజిలెన్స్ విచారణ సైతం జరిపి అక్రమాలు జరిగినట్లు గుర్తించింది. వాటిపై విచారణ పెండింగ్‌లో ఉంటుండగానే బిల్లుల చెల్లింపులు మొదలు పెట్టింది. ప్రభుత్వం వాటిని కేసులను సైతం ఎత్తేసేందుకు నిర్ణయించినట్లుగా తెలుస్తోంది. నాడు అక్రమమైన పనులు నేడు సక్రమమెలా అయ్యాయనే సందేహాలు అందరిలోనూ వ్యక్తమవుతున్నాయి. కార్యకర్తలకు అప్పుడెప్పుడో చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను ఆఘమేఘాలపై చెల్లిస్తున్న ప్రభుత్వం చిరుద్యోగులకు నెలల తరబడి చెల్లించాల్సిన జీతాలను ఇవ్వడానికి మాత్రం మనస్కరించడం లేదు. డిఆర్‌డిఎలో పనిచేస్తున్న విఒఎలకు ఆరు నెలలుగా, ఎఎన్‌ఎంలకు ఏడాది కాలంగా వేతనాలు ఇవ్వలేదని తెలుస్తోంది. అంగన్వాడీ సెంటర్లకు ఆరు మాసాలుగా కట్టెల బిల్లులు, అద్దెలు, కరెంట్ బిల్లులు, పోపులు బిల్లులు చెల్లించలేదు. ఇలా చెప్పుకుంటే వెళ్తే అనేక ప్రభుత్వశాఖలకు చెందిన ఉద్యోగులకు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలకు వేతన బకాయిలు ఉన్నాయి. అందరి సంక్షేమం చూడాల్సిన ప్రభుత్వం మాత్రం కార్యకర్తలను సంతోష పెట్టే పనిచేస్తోందంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నీరు-చెట్టు బిల్లులను త్వరత్వరగా చెల్లించి, కొత్త పనులను చేసేందుకు తెలుగు తమ్ముళ్లను ప్రభుత్వం సిద్ధంగా చేస్తున్నట్లుగా కనిపిస్తోంది. సాగునీటి సంఘాలకు మూడు వారాల్లో ఎన్నికలు జరిపిస్తామని ఇటీవల మంత్రుల సమావేశంలో ప్రకటించిన విషయం తెలిసిందే. సాగునీటి సంఘాల ఎన్నికలూ స్కూల్ మేనేజిమెంట్ కమిటీ (ఎస్ఎంసి) ఎన్నికలకు భిన్నంగా జరిగే పరిస్థితి ఏమీ ఉండదు. రాజకీయాలకతీతంగా జరగాల్సి ఉన్నా... మొన్న జరిగిన ఎస్ఎంసి ఎన్నికలు ఏవిధంగా జరిగాయో మనం చూశాం. నీటి సంఘాల ఎన్నికలూ అవే తరహాలో అత్యధిక సంఘాలకు టిడిపి సానుభూతిపరులు ఎన్నికవ్వడం ఖాయం. ఎన్నికల సంఘాలకే నీటి పారుదల శాఖ ద్వారా చేపట్టే పనులు చేసే వీలుంది. ప్రస్తుతం నీరు-చెట్టు పెండింగ్ బిల్లులను చెల్లిస్తే చేతిలో కాసులు చేరి కొత్త పనులు చేపట్టేందుకు ఉత్సాహంతో ముందుకొస్తారనేది ఒక ఆలోచనగా కనిపిస్తోంది.

కూటమి నాయకులు, కార్యకర్తలకు మరికొద్ది రోజుల్లో శుభవార్త చెప్తామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల మంత్రులతో నిర్వహించిన సమావేశంలో ప్రకటించడంతో ఆశావహుల ముఖాల్లో సంతోషం వెల్లివిరిస్తోంది. వంద రోజుల లోపు నామినేటెడ్ పోస్టుల భర్తీ పూర్తి చేస్తామని చెప్పడంతో కూటమి శ్రేణులు రోజులు లెక్కగట్టుకుంటున్నాయి. ఎన్నికల్లో మూడు పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు ఎలా జరిగిందో ఈ పోస్టులనూ అలాగే పంచుకుంటామంటూ ప్రకటించారు. నామినేటెడ్ పోస్టుల సర్దుకోవడం, పంచుకోవడం సరే తమ పోస్టుల సంగతేంటని నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల ముందు రెండు లక్షలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని చెప్పిన కూటమి నేతలు ఇప్పుడు దానిపై మాట మాత్రంగానైనా ప్రస్తావించడం లేదు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం డిఎస్‌సి వేశామని ప్రచారం చేసుకోవడానికి, నిరుద్యోగులను సంతృప్తి పరచడానికే అన్నట్లు దానిపై తొలి సంతకం చేసి, తదుపరి చర్యలు మానేశారు. నేను మారానని బాబు చెప్తుంటే, వెంటనే డిఎస్‌సి ఉద్యోగ ప్రకటన వచ్చేస్తుందంటూ నిరుద్యోగ ఉపాధ్యాయులు ఎనలేని నమ్మకం పెట్టుకున్నారు. తీరా వారు పుస్తకాలు ముందేసుకుని సాధన మొదలు పెట్టిన తర్వాత డిసెంబరులో పరీక్ష నిర్వహిస్తామంటూ చావుకబురు చల్లగా చెప్పి వారి ఆశలపై నీళ్లు చల్లారు.

డిసెంబరులో పరీక్ష నిర్వహించి, కొత్త విద్యా సంవత్సరం వరకు సాగదీసి ఒక ఏడాది పాటు జీతాలు మిగిలించుకోవాలన్న ప్రభుత్వ పొదుపు సూత్రం పాపం నిరుద్యోగులకు ఏం తెలుస్తుంది? రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చూస్తుంటే భయమేస్తుందంటూ ఒక పక్క చంద్రబాబు బీద అరుపులు అరుస్తూనే మరోవైపు నిధుల ఖర్చుతో ముడిపడి ఉన్న నామినేటెట్ పోస్టుల భర్తీ, నీరు చెట్టు పెండింగ్ బిల్లుల చెల్లింపులకు వందల కోట్ల రూపాయలను విడుదల చేయడం చూస్తుంటే పథకాలను ఎగ్గొట్టడానికే బాబు ఈ మాటలు చెప్తున్నారా? అనే అనుమానాలు ప్రజల్లో రాకమానవు. తమ పట్ల ఒకలా, కార్యకర్తల పట్ల మరోలా ప్రభుత్వం వ్యవహరిస్తుందనే ప్రజలు అనుకునే పరిస్థితికి తీసుకురావడం కూటమి ప్రభుత్వానికి శ్రేయస్కరం కాదు. అది ప్రభుత్వంపై జనంలో విశ్వాసం సన్నగిల్లే ప్రమాదమూ లేకపోలేదు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలు, సూపర్-సిక్స్ పథకాల అమలుపై ప్రభుత్వం దృష్టి సారించి సంక్షేమంలో సమతుల్యత పాటించాలని అంతా ఆశిస్తున్నారు.


ఎమ్మెల్యేను సన్మానించిన హరిబాబు

మిజోరాం గవర్నర్‌ను కలిసిన ఎమ్మెల్యే శిరీష

ప్రజాశక్తి- పలాస

మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబును ఎమ్మెల్యే గౌతు శిరీష, టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్నచౌదరి కలిశారు. శనివారం విశాఖపట్నం వచ్చిన సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా గౌతు లచ్చన్నతో ఉన్న సత్సంబంధాలను హరిబాబు గుర్తు చేసుకున్నారు. లచ్చన్న మనవరాలు ఎమ్మెల్యేగా ఎన్నికై కావడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్యే శిరీషకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. అనంతరం శిరీష మాట్లాడుతూ తాతయ్య ఆత్మీయ అనుచరులను కలవడం సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు.

మానవత్వానికి మచ్చుతునక

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- కవిటి

ఎవరైనా ఆపదలో ఉన్నారని తెలిస్తే తక్షణమే స్పందించేందుకు వేల హృదయాలు సిద్ధంగా ఉన్నాయని మరోసారి రుజువైంది. 'ఆయువు కోసం పోరాటం' అంటూ ప్రజాశక్తి శనివారం ప్రచురించిన కథనానికి దాతలు అనూహ్యంగా స్పందించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వలస కూలీ అప్పారావుకు అండగా నిలిచేందుకు ముందుకొచ్చారు. బాధితుని ఫోన్ పే నంబరు శనివారం రూ.70 వేలు వరకు ఆర్థికసాయం వచ్చినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. అంతేకాకుండా అప్పారావు దయనీయస్థితికి చలించి నియోజవర్గంలోని పలు స్వచ్ఛంద సంస్థలు ఆర్థికసాయం అందించేందుకు ముందుకు వస్తున్నాయి. మరో రెండు, మూడు రోజుల్లో తమ తమ సంస్థల ద్వారా అప్పారావుకు ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు.


పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

రహదారి పరిశీలన

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని మెట్టూరు బిట్-2 పంచాయతీ పడైన రహదారి నంబరు పదిని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శనివారం పరిశీలించారు. రోడ్డు అభివృద్ధికి కృషి చేస్తామని వంశధార నిర్వాసితులకు హామీనిచ్చారు. ఈయన వెంట వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీ వర ప్రసాదరావు, లోతుగెడ్డ తాతబాబు, కోయిలాపు సంజీవరావు, ఎంపిటిసి పి.సింహాచలం, ఇసై ప్రశాంత్‌కుమార్, పెదకోట శ్రీనివాసరావు, పెదకోట శ్రీరాములు, వజ్జ రవి, రామలవలస పకీర్, గండివలస జోగినాయుడు ఉన్నారు.


ఆక్రమణదారులతో మాట్లాడుతున్న తహశీల్దార్

అక్రమ కట్టడాలను తొలగించాలి

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మించిన కట్టడాలను సెప్టెంబర్ 2లోగా తొలగించకపోతే ప్రభుత్వ యంత్రాంగం స్వయంగా దగ్గరుండి తొలగించడం జరుగుతుందని తహశీల్దార్ ఎల్.మధుసూధనరావు ఆక్రమణదారులకు స్పష్టం చేశారు. శనివారం మండల కేంద్రంలోని అక్రమ కట్టడాలను ఆయన పరిశీలించారు. అలికాం - బత్తిలి రోడ్డు పక్కన ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మించిన కట్టడాల తొలగింపునకు సంబంధించి 131 మందికి ఇటీవల నోటీసులు జారీ చేశారు. మీరు నిర్మించిన కట్టడాల్లో ఉన్న సామాన్లును గడువులోగా తరలించకపోతే తొలగించే సమయంలో విలువైన వస్తువులు పాడైపోతాయని దానికి మేము బాధ్యులం కాదని గుర్తుంచుకోవాలని ఆక్రమణదారులకు స్పష్టం చేశారు. కార్యక్రమంలో రోడ్లు, భవనాలు శాఖ జెఇ ఆంజనేయ నాయక్, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ బాబూరావు, విఆర్ఒ సుజాత పాల్గొన్నారు.


బ్లీచింగ్‌ను పిచికారీ చేస్తున్న యువకులు

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి- జి.సిగడాం

కురుస్తున్న భారీవర్షాలు, తుపానుల కారణంగా దోమలు, అంటు వ్యాధులు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మండలంలోని పలు పంచాయతీల్లో శనివారం ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. ఇందులో భాగంగా మండలంలో ఆబోతుల పేట గ్రామ యువత గ్రామంలో పారిశుధ్య పనుల్లో భాగంగా గ్రామం మొత్తం బ్లీచింగ్ చల్లారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో ప్రజలకు తెలియజేశారు.


మాట్లాడుతున్న జడ్జి ప్రసన్నలత

ఎక్కువ కేసులు రాజీ చేసుకోవాలి

కోటబొమ్మాళి: సెప్టెంబరు 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసుకోని విజయవంతం చేయాలని మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షులు, జూనియర్ సివిల్ జడ్జ్ బి.ఎం.ఆర్.ప్రసన్నలత తెలిపారు. కోర్టు అవరణలో న్యాయవాదులతో కలిసి ప్రీ లోక్ అదాలత్‌ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జరగబోయే కేసుల్లో ముందుగానే పార్టీలకు నోటీసులు, వారివారి న్యాయవాదుల ద్వారా చర్చించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాద సంఘ అధ్యక్షులు లక్కినేని శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్ బి.నారాయణరావు, ఎజిపి ఎస్.తిరుపతి, సిహెచ్.వెంకటరావు, కె.మన్మథరావు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం


పోలాకి : పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి


మెళియాపుట్టి : పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

ప్రజాశక్తి- పొందూరు

అర్హతే ప్రామాణికంగా పారదర్శకంగా కూటమి ప్రభుత్వం ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేపడుతుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. పట్టణంలో శనివారం పింఛన్లు పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ పింఛన్లను ఆగస్టు 31న పంపిణీ చేయడం వృద్ధులు, వికలాంగులు, వితంతువులపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలియ జేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సీపాన హరిహరరావు, టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహనరావు, పట్టణ అధ్యక్షుడు అనకాపల్లి శ్రీరంగ నాయకులు, ఉపాధ్యక్షుడు బాడాన శేషగిరినాయుడు, ఎంపిటిసి వాణి, టిడిపి నాయకులు విజయలక్ష్మి, శాంతారాం, బాల, లక్ష్మి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్కూటీపై రవికుమార్ సందడి

పట్టణంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే రవికుమార్ స్కూటీపై తిరుగుతూ పింఛన్లను పంపిణీ చేశారు. వీధుల్లో తానే స్వయంగా స్కూటీని నడుపుతూ లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు.

లావేరు: మండలంలోని గోవిందపురం, అదపాక గ్రామాల్లో ఎన్‌టిఆర్ సామాజిక భరోసా పింఛన్లను ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు చేతులమీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, ఎచ్చెర్ల ఎఎంసి చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇజ్జడ శ్రీనివాసరావు, సర్పంచ్ పిల్ల గోపాలరావు, మాజీ ఎంపిపి మీసాల వెంకటరమణ, నడిమింటి చార్లెస్, బాబూరావు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

జి.సిగడాం: మండలంలోని ఎందువ, గెద్దకంచరాంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఈశ్వరరావు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఆశావర్కర్లు, కార్యదర్శి, వీఆర్ఓ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండలంలోని సుందరాడలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పింఛన్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.చంద్రకుమారి, తహశీల్దార్ హనుమంతరావు, మాజీ ఎంపిపి సలాన మోహనరావు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు భాస్కర్‌గౌడ, ఎంపిటిసి సంబాల వెంకటరావు, బుద్ద లలితకుమారి, ఎస్.ఎల్లంనాయుడు, కరంజాల రాజు, రవ్వల గణపతి, జనసేన పడమేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

కొత్తూరు : మండలంలోని ఓంద్రుజోలలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, మాజీ ఎమ్మెల్యే టిడిపి జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణలు పింఛన్లను పంపిణీ చేశారు. కొత్తూరులో వైస్ ఎంపిపి తులసీ వరప్రసాదరావు, తహశీల్దార్ బి.పాపారావు పాల్గొన్నారు.

పోలాకి : మండలంలోని కుసుమపోలవలసలో ఎమ్మెల్యే పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ అబ్జర్వర్ వెంకటరావు, మండల పార్టీ అధ్యక్షులు ఎం.వెంకటఅప్పలనాయుడు, సర్పంచ్ ప్రతినిధి


పొందూరు : పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్


లావేరు : గోవిందపురంలో పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈశ్వర్

టి.లక్ష్మీనారాయణ, మార్కెట్ మాజీ అధ్యక్షులు బైరి భాస్కరరావు, తహశీల్దార్ ఎం.సురేష్‌కుమార్, ఎంపిడిఒ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ పరిశీలన

పలాస : కాశీబుగ్గ చినబడాంలో పంపిణీ చేసిన పింఛన్ల పంపిణీని ఆర్‌డిఒ భరత్ నాయక్ పరిశీలించారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో 6,174 పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా, 5,933 పంపిణీ చేశారని అన్నారు. మండలంలోని 6,321 పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా, 6,096 పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడు, కమిషనర్ టి.నాగేంద్రకుమార్, టిడిపి నాయకులు బద్ద నాగరాజు పాల్గొన్నారు.

తీరప్రాంత అభివృద్ధికి కృషి

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు


శంకుస్థాపన చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

అవదుల్లే వివక్షత పాలన అందిస్తామని, మూలపేట నుంచి విశాఖపట్నం వరకు తీరప్రాంతం అభివృద్ధి చేస్తామని, త్వరలో ప్రభుత్వ రాజముద్రతో పాసు పుస్తకాలు జారీ చేస్తామని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని రావివలసలో పింఛన్లు పంపిణీ చేసిన అనంతరం రూ.77.30 లక్షలతో నిర్మించిన రైతు సేవా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్, గ్రామ సచివాలయ భవనాలను శనివారం ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. గత ప్రభుత్వ పాలనపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో గత ఐదేళ్ల కక్షపూరిత పాలన చేశారని అన్నారు. వాలంటీర్లు కంటే ముందుగానే పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. 1వ తేదీన ఆదివారం వచ్చినందు వల్ల అధికారులకు ఇబ్బంది లేకుండా ముందురోజే ఫించన్లు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. నౌపడ నుంచి వడ్డితాండ్ర వచ్చే రహదారిని మంజూరు చేస్తామన్నారు. త్వరలోనే శంకుస్థాపన చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఎండలమల్లిఖార్జున స్వామి కొత్తమ్మతల్లి ఆలయానికి ఇప్పటికే గతంలో కొన్ని నిధులు మంజూరు చేశామని, దేవాదాయశాఖ అధికారులను తీసుకువచ్చి వారితో చర్చించి ఆలయం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఉపాధి హామీ నిధుల నుంచి కాలనీ వాసులకు రూ.140 కోట్లతో మిగిలి ఉన్న సిసి రోడ్లు, కాలువలు నిర్మిస్తామని వివరించారు. సెప్టెంబరులో నీటి సంఘాలకు ఎన్నికలు జరుగనున్నాయని, గొడవలు పడకుండా రైతులంతా సమన్వయంతో కాలువ బాగు చేసుకోవాలని అన్నారు.

మూలపేట పోర్టు శరవేగంగా పూర్తి చేస్తామని చెప్పారు. నిర్మించిన గృహాలకు సంబంధించి బిల్లులు అవ్వకపోతే అప్‌లోడ్ చేయాలని చెప్పారు. గ్రామ సచివాలయ భవనం ఆవరణలో మొక్కలు నాటారు. మాజీ జెడ్‌పిటిసి కె.ఎల్.నాయుడు గ్రామంలో సిసి రోడ్లు, గృహాలు లేనివారికి గృహాలు తదితర సమస్యలను మంత్రి దృష్టికి తీసువచ్చారు. కార్యక్రమంలో టెక్కలి ఆర్‌డిఒ సుదర్శన్‌దొర, ఇన్‌ఛార్జి డిపిఒ ఆర్.వెంకట్ రామన్, తహశీల్దార్ దిలీప్‌చక్రవర్తి, ఎంపిడిఒ చింతాడ లక్ష్మీబాయి, ఎంపిపి ఎ.సరోజనమ్మ, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు బగాది శేషగిరి, మాజీ ఎంపిపి సుందరమ్మ, పశు సంవర్ధకశాఖ జెడి జయరాజు, వ్యవసాయశాఖ ఎడి బి.వి.తిరమలరావు పాల్గొన్నారు.


గాయపడిన బాలరాజు

యువకునికి గాయాలు

టెక్కలి రూరల్ : టెక్కలి మేజర్ పంచాయతీ పరిధిలో ఎలక్ట్రీషియన్ విధులు నిర్వహిస్తున్న బొమ్మాళి బాలరాజు శనివారం విద్యాఘాతానికి గురై తీవ్ర గాయాలకు గురయ్యాడు. స్థానిక చిన్నబజారు కూడలి సమీపంలో విద్యుత్ స్తంభంపై పనిచేస్తున్న సమయంలో విద్యుత్ షాక్‌కు గురయ్యారు. దీంతో స్తంభంపై నుంచి కిందికి పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం జిల్లా సర్వజనాస్పత్రికి రిఫర్ చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.


సీజ్ చేసిన లారీలు

ఇసుక లారీలు పట్టివేత

ప్రజాశక్తి- కొత్తూరు


మండలంలోని ఆకుల టంపర ఇసుక ర్యాంపు నుంచి మూడు రోజులుగా రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఈ విషయంపై శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, మాజీ ఎమ్మెల్యే, టిడిపి జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణలకు సమాచారం అందింది. శనివారం ఉదయం కలెక్టర్‌కు, ఎస్‌పికి ఫోన్ సమాచారం అందజేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్ఐ ఎం.ఎ.అహమ్మద్ తన సిబ్బందితో దాడులు నిర్వహించి నాలుగు ఇసుక లారీలను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నారు.


భర్త ఇంటి ముందు నిరసన తెలుపుతున్న భార్య

భర్త ఇంటికి తాళం

ప్రజాశక్తి- టెక్కలి

పట్టణంలోని రాందాసుపేట ప్రాంతానికి చెందిన కోతి రామకృష్ణ ఇంటికి భార్య సుహాసిని శనివారం తాళం వేసి ఇంటి ముందు నిరశన వ్యక్తం చేసింది. రామకృష్ణకు సుహాసినితో కొన్నాళ్ల క్రితం వివాహం జరిగింది. అయితే వీరిద్దరి మధ్య గొడవలతో భార్యభర్తలిద్దరు వేరువేరుగా ఉంటున్నారు. తన భర్త రామకృష్ణ భారతి అనే వేరే మహిళతో అక్రమ సంబంధం పెట్టుకుని తనను, పిల్లలను అన్యాయం చేస్తున్నారని వాపోయింది. తను ఇంటిలో లేనప్పుడు భారతిని రామకృష్ణ తీసుకువచ్చాడనన్న విషయం తెలుసుకున్న సుహాసిని నేరుగా ఇంటికి వెళ్లి తాళం వేసింది. అప్పటికే భర్త రామకృష్ణ పరాయి మహిళ భారతి ఆ ఇంట్లో ఉన్నారు. విషయం తెలుసుకున్న బంధువులు రాందాసుపేట వీధికి చేరుకుని సుహాసినికి ఆండగా నిలిచారు.


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవి

'ఇంజరాపు' సేవలు ప్రశంసనీయం

మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సామాజిక బాధ్యతతో డా.ఇంజరాపు మోహన రావు ప్రజలకు నిరంతరాయంగా అందిస్తున్న సేవలు అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. శనివారం అరసవల్లికి చెందిన మోహనరావు జన్మదినం సందర్భంగా రెడ్‌క్రాస్ ప్రాంగణంలో రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగర ప్రజల్లో ఎవరికి ఏ ఆపదొచ్చినా నేనున్నానంటూ ముందుకు వచ్చి సేవలందిస్తున్నారన్నారు. కరోనా కష్ట కాలంలో ఆయన చేసిన సేవలకు గౌరవ డాక్టరేట్ అందుకున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

టెక్కలి: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న భౌతిక శాస్త్రం విభాగానికి ఆతిధి ఉపన్యాసక పోస్టుకు ధరఖాస్తులు కోరుతున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్‌సి పిజిక్స్‌లో చదివిన వారు, 55 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. సెప్టెంబర్ 6న ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. సెట్, నెట్ కోర్సులు చేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడునని, ఆసక్తి గల అర్హత ఉన్నవారు ఉదయం పది గంటలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని ప్రిన్సిపాల్ కోరారు.

పాలకొండ చెత్తను ఇక్కడ వేస్తారా?

బూర్జ: పాలకొండ చెత్తను తమ గ్రామం వద్ద వేయడం ఎంతవరకు సమంజసమని ఆ గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. పాలకొండ పట్టణానికి సంబంధించి మూడు ఎకరాల భూమి బూర్జ మండలం డొంకల పర్త పంచాయతీ పరిధిలోని హరిపురం, పల్లాపురం గ్రామం వద్ద ఉంది. ఈ స్థలాన్ని నగర పంచాయతీ పాలకవర్గం గుర్తించి డంపింగ్ యార్డ్ ఇక్కడ ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. దీంతో తమ గ్రామ సమీపంలో చెత్త వేయడంతో దుర్గంధం వెదజల్లుతుందని, వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆయా గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకొండకు సంబంధించి డంపింగ్ యార్డ్ ఇక్కడ ఏర్పాటు చేయడం సమంజసం కాదని ఈ ప్రయత్నాన్ని విరమించుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. లేని పక్షంలో ఈ విషయాన్ని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని గ్రామస్తులు స్పష్టం చేశారు.

నర్సింగ్‌పై ఉచిత శిక్షణ

శ్రీకాకుళం అర్బన్: డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యాన నిరుద్యోగులకు నగరంలోని నర్సింగ్ (జనరల్ డ్యూటీ అసిస్టెంట్) కోర్సులో ఉచిత శిక్షణ, సర్టిఫికెట్, వసతి సౌకర్యం, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ బి.సురేష్ ఒక ప్రకటన విడుదల చేశారు. కోర్స్ పూర్తి చేసినవారికి సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ఇప్పటివరకు ఫౌండేషన్ ద్వారా 518 మంది నిరుద్యోగ యువతకు నైపుణ్యంతో కూడిన శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. అత్యాధునిక సదుపాయాలతో కూడిన స్కిల్లింగ్ ల్యాబ్, డిజిటల్ తరగతుల్లో శిక్షణ, ప్రైవేట్ ఆస్పత్రిలో ఆన్ జాబ్ ట్రైనింగ్, సాఫ్ట్ స్కిల్స్ శిక్షణ ఇవ్వడం ద్వారా వివిధ రకాల కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉపాధి అవకాశాలు పొంద గలిగారన్నారు. జిడిఎ కోర్స్‌లో చేరేందుకు 19 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు కలిగి ఉండాలని, కనీస విద్యార్హత పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న వారు 9154814523 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

కుట్టుపై...

టెక్కలి: శ్రీసత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ ఇవ్వనున్నట్టు కన్వీనర్ బి.మల్లేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 50 రోజుల పాటు ఇచ్చే శిక్షణ ఆనంతరం సంబంధిత కోర్సులో సర్టిఫికెట్లు అందిస్తామని, వీటి ద్వారా స్వయం ఉపాధి పొందడానికి అవసరమైన రుణం కూడా లభిస్తుందన్నారు. ఆసక్తి గల వారు 9490222964 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

సంస్థ నుంచే వేతనాలు చెల్లించాలి

కవిటి: మీటర్ రీడర్లకు చెల్లించే వేతనం ప్రస్తుతం కాంట్రాక్టర్ నుంచి అందుతోందని, అలా కాకుండా నేరుగా విద్యుత్ సంస్థ నుంచే చెల్లించాలని విద్యుత్ మీటర్ రీడర్లు కోరారు. ఈ మేరకు సోంపేట డివిజన్ డిఇ యోగీశ్వరరావుకి శనివారం వినతిపత్రం అందజేశారు. ప్రతినెలా ఇంటింటికీ తిరిగి రీడింగ్ సేకరించే తమకు ఉద్యోగ భద్రత కల్పించాలి నేరుగా సంస్థతో లావాదేవీలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ మీటర్ రీడర్ల కార్యదర్శి దూగాన భాస్కర్, ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న మీటర్ రీడర్లు

విఒఎల బకాయిలు చెల్లించాలి


మాట్లాడుతున్న మహాలక్ష్మి

ప్రజాశక్తి- పాతపట్నం

విఒఎలకు ఆరు నెలల బకాయిని తక్షణమే చెల్లించాలని, అక్రమ తొలగింపులు, వేధింపులు ఆపాలని విఒఎల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ మేరకు పాతపట్నంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా చాలా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. వేతనాలకు చెల్లించాలని అనేకసార్లు వినతిపత్రాలు అందించినా స్పందించకపోవడం సరికాదన్నారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా విఒలను అక్రమ తొలగింపులకు, వేధింపులకు గురవుతున్నారు. స్థానిక రాజకీయ నాయకులతో కలిసి నిబంధనలకు విరుద్ధంగా అక్రమ తొలగింపులకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు, గ్రామస్థాయి రాజకీయ నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గ్రామ సమాఖ్య జనరల్ బాడీ సమావేశం నిర్వహించడం లేదని, ఎజెండా, తీర్మానం లేకుండా, కొత్త మినిట్స్ బుక్‌లో మండల అధికారులే తీర్మానం రాస్తున్నారని అన్నారు. గ్రామ సంఘం లీడర్లను మండల సమాఖ్యకు పిలిచి విషయం చెప్పకుండా సంతకాలు చేయించుకుంటున్నారని అన్నారు. తరువాత పాతవారిని తొలగించి కొత్తవారని నియమించడం అనైతికమన్నారు. అక్రమంగా తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు డి.జోగారావు, జి.యర్రయ్య, డి.జయంతి, అన్నపూర్ణ, గాయత్రి, బాలామణి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

లోకనాథం సేవలు ఆదర్శనీయం


మాట్లాడుతున్న కృష్ణమూర్తి

ప్రజాశక్తి- సోంపేట

మర్రి లోకనాథం మాస్టారు సేవలను నేటి తరానికి ఆదర్శనీయమని సిపిఎం సీనియర్ నాయకులు, యుటిఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షులు పాతిని కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని బట్టిగల్లూరు పాఠశాల వద్ద జి.సీతారాం మాస్టారు అధ్యక్షతన లోకనాథం మాస్టారు ఉద్యోగ విరమణ సభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లోకనాథం మాస్టారు అభ్యుదయ భావాలు గల వ్యక్తి అని అన్నారు. విద్యార్థుల ఉన్నతికి కృషి చేశారని గుర్తు చేశారు. అనంతరం గోకనాథం మస్టారు ఇందిర దంపతులకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు లండ బాబూరావు, జానకి రామయ్య, స్థానిక సర్పంచ్ బట్టి మాధవరావు మామిడిపల్లి సర్పంచ్ పాతిన శేషగిరి, ఎంపిటిసి దున్న మాధవరావు, జిల్లా అగ్నికుల క్షత్రియ సంఘ నాయకులు గోరకల వసంతస్వామి, జుత్తు నీలకంఠం, బచ్చల మధు, పులకల శ్రీరాములు, జిల్లా అగ్నికుల క్షత్రియ గౌరవాధ్యక్షులు రొయ్య కోదండ కృష్ణ, ఎంఇఒ సవర జోరోడు, ఎల్.బాబూరావు, జి.శ్రీనివాసరావు, జి.రాజేష్, ఎస్.కోదండరాం, ఎస్.గోవిందరావు, జి.నాగేశ్వరరావు, డి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్


శంకర్, ఎమ్మెల్యే

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణం గా గత మూడు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని, మరో రెండు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే గొండు శంకర్ తన కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. భారీ వర్షాలు కురుస్తున్న దృష్ట్యా నియోజకవర్గంలోని ప్రజలు శిథిలమైన, పాత ఇండ్లలో ఉండవద్దని సూచించారు. వర్షాల కారణంగా గోడలు, శ్లాబులు కూలి ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున సురక్షిత ప్రాంతాల్లో ఉండాలన్నారు. అదే విధంగా చెరువుల్లో, వాగుల్లో, కాలువల్లో నీరు అధికంగా చేరడంతో స్నానాలకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలన్నారు. చిన్నారులను నీటి ప్రవాహాల వద్దకు తీసుకు వెళ్లవద్దని తెలిపారు. అలాగే పిడుగులు పడే అవకాశం ఉన్నందున పశువుల కాపర్లు జాగ్రత్త ఉండాలన్నారు. గార, రూరల్ మండలాలకు చెందిన మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్ల వద్దని స్పష్టం చేశారు. వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడంతో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని కోరారు. వైద్యాధికారులు గ్రామాల్లో పర్యటించి ఎప్పటి కప్పుడు ప్రజల ఆరోగ్యంపై ఆరా తీస్తూ ప్రజారోగ్య రక్షణకు శ్రద్ధ వహించాలని, వర్షాల కారణంగా కాలువల్లో చెత్తాచెదారం నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు ఆదేశించారు.

అధికారుల పరిశీలన


కవిటి : మాట్లాడుతున్న తహశీల్దార్ మురళీమోహన్

ప్రజాశక్తి- కవిటి

అల్పపీడన ప్రభావం కొనసాగుతొందని మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ మురళీమోహన్ సూచించారు. మండలంలోని ఇద్దివానిపాలెంను శనివారం రెవెన్యూ, పోలీస్ సిబ్బంది శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మత్స్యకారులతో మాట్లాడుతూ తీరం అల్లకల్లోలంగా ఉంటుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ వేటకు వెళ్లవద్దని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో మండల కేంద్రంలోని టోల్ ఫ్రీ నంబరుకు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ కె.రాము, ఆర్ఐ రమణమూర్తి, ఎఒ శ్రీనివాస్‌రెడ్డి, ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రాహి, పంచాయతీ కార్యదర్శి గుణవతి, విఆర్ఒ దివాకర్ పాల్గొన్నారు.

పోలాకి : మండలంలో సముద్ర తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ ఎం.సురేష్‌కుమార్ సూచించారు. సముద్ర తీర ప్రాంతాలైన రాజారాంపురం, గుప్పిడిపేట, గుల్లవానిపేట గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. రెండు రోజులు వరకు మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని సూచించారు. పోలాకి, పల్లిపేట, డోల, సుసరాం నీటి ముంపు ప్రాంతాలను మండల ఎఒ చిరంజీవి పరిశీలించారు. ఎస్ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.



సూర్యనారాయణను అభినందిస్తున్న కలెక్టర్, జెసి

సూర్యనారాయణ సేవలు అభినందనీయం

శ్రీకాకుళం అర్బన్: క్రమశిక్షణ, విధులపై అంకితభావం ఏ ఉద్యోగికైనా గౌరవప్రదమైన స్థానంలో నిలబెడతాయని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జాయింట్ కలెక్టర్ దఫేదార్‌గా 12 ఏళ్లు, మొత్తంగా 40 ఏళ్లు రెవెన్యూ శాఖలో పని చేసిన తెలగవలస సూర్యనారాయణ వీడ్కోలు సభ శనివారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులు, రెవెన్యూ అసోసియేషన్, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు పాల్గొని ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పదవి విరమణ ప్రతి ఉద్యోగికీ తప్పనిసరని, తన ఉద్యోగ జీవితంలో ఎక్కువమంది ఐఎఎస్ అధికారులతో పనిచేయడం సాధారణ విషయం కాదన్నారు. ఎంతో మంచి వ్యక్తి అయితేనే ఆ అవకాశం కలుగుతుందన్నారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ మాట్లాడుతూ తనతో 24 గంటలు ఉండి, ఇంటి మనిషిలా చూసుకునే వ్యక్తి సూర్యనారాయణ అని చెప్పారు. 1981 నుంచి తన సర్వీసు అనుభవాలను పంచుకున్న సూర్యనారాయణ భావోద్వేగానికి గురయ్యారు. కార్యక్రమంలో ఆయనతో పాటు భార్య [illegible]ను కలెక్టర్, జెసిలు ఘనంగా సత్కరించారు. డిఆర్‌ఒ అప్పారావు, రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాస్, ఎ.సూర్యనారాయణ, డిఎస్‌ఒ బి.శాంతిశ్రీ, పలు విభాగాల సూపరింటెండెంట్లు, కలెక్టరేట్ ఉద్యోగులు సత్యనారాయణను పుష్పగుచ్ఛాలతో అభినందించారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- పలాస

కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినుల వసతి గృహంలో రహస్యంగా కెమెరాలు పెట్టిన దుర్మార్గమైన చర్య అని, వాటిలో పాల్గొన్న నిందితులను శిక్షించాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పలాసపల్లి కుసుమ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని బొడ్డపాడులోని పిఒడబ్ల్యు కార్యాలయంలో సంఘం జిల్లా నాయకులు కుత్తుం హేమన్న, బర్ల జనకమ్మలతో కలిసి శనివారం మాట్లాడారు. లక్షలాది రూపాయలు ఫీజులు దండుకుంటున్న యాజమాన్యం వసతిగృహాల్లో సరైన పర్యవేక్షణ చేయడం లేదన్నారు. హిడెన్ కెమెరాల విషయంపై సమగ్ర విచారణ చేపట్టాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఎపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కాశీనగర్ స్వపరిపాలన దినం

పర్లాకిమిడి: గజపతి జిల్లా కాశీనగర్ పట్టణంలో శనివారం స్థానిక స్వపరిపాలన దినం ఘనంగా నిర్వహించారు. కాశీనగర్ ఎన్ఎసి అధ్యక్షులు మెడిబోయిన సుధారాణి, ఉపాధ్యక్షులు రఘురాం సాహు, కార్యనిర్వహణ అధికారి భాగవత్ సాహు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. కాశీనగర్ అభివృద్ధికి కృషి చేస్తానని సుధారాణి తెలిపారు. వంశధార నదిపై నిర్మిస్తున్న వంతెన పనులు పూర్తికి కృషి చేస్తామన్నారు.

యాంత్రీకరణపై యువ రైతులకు శిక్షణ

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయ యాంత్రికరణపై యువ రైతులకు వారం రోజులు పాటు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కె.భాగ్యలక్ష్మి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆత్మ ఆర్థిక సౌజన్యంతో ఈనెల 28 నుంచి సెప్టెంబర్ 2 వరకు ఈ శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో వ్యవసాయ, ఉద్యాన పంటల్లో ఉపయోగించే వివిధ పరికరాలు, యంత్రాలపై శిక్షణ ఇచ్చి వాటిపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. గ్రామీణ యువతకు వ్యవసాయ యాంత్రీకరణలో ఉన్న అన్ని మెలకువలను వారం రోజుల పాటు అనుభవజ్ఞులైన అధ్యాపకులు, శాస్త్రవేత్తలతో తరగతులు చెప్పించడం జరుగుతుందని విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.నీలవేణి తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయంలో ఉపయోగించే వివిధ యంత్రాలు, వాటి పనితీరు, వాటిని ఏ విధంగా



యాంత్రీకరణపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

పరిరక్షించుకోవాలన్న విషయాలపై కృషి విజ్ఞాన కేంద్రం కొండెంపూడి నుంచి వ్యవసాయ ఇంజనీరింగ్ శాస్త్రవేత్త పి.బాబు యువ రైతులకు వివరించారు. కష్టం హైరింగ్ సెంటర్స్ యొక్క అవకాశాలు, బలాలు ఏంటన్న విషయాలపై వ్యవసాయ కళాశాల నైరా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి. వెంకటరావు వివరించారు. ఈ శిక్షణలో పాల్గొన్న యువ రైతులు ఇటీవల జరిగిన యాంత్రికరణ మేళాలో కూడా పాల్గొని వివిధ యంత్రాలను, వ్యవసాయ పరిశోధనా స్థానం రాగోలు పొలాలను సందర్శించారు. ప్రస్తుతం వాడుకలో ఉన్న వ్యవసాయ యంత్ర పరికరాలపై, ఉద్యాన యంత్ర పరికరాలపై సేద్య ఉద్యానవన విభాగం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్, డాక్టర్ వి. హరికుమార్‌లు రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయం, ఉద్యాన పంటల్లో ఉపయోగించే వివిధ పిచికారీ చేసే యంత్రాలు, స్ప్రేయర్లు, డ్రోన్లు, పిచికారీ చేసుకునేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సస్యరక్షణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.అనూష రైతులకు వివరించారు. వ్యవసాయ యాంత్రీకరణను వ్యాపార దృక్పదంగా ఏ విధంగా మలుచుకోవచ్చు అన్న విషయంపై వ్యవసాయ కళాశాల నైరా ప్రొఫెసర్ డాక్టర్ చిన్నం నాయుడు రైతులకు వివరించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళంలో యాంత్రికరణలో విజయం పొందిన రైతులచే వరాహ నరసింహులు కొబ్బరి చెట్లు ఎక్కే మిషన్, చంద్రశేఖర్ వివిధ యంత్ర పరికరాలపై సూర్యరావుతో యువ రైతులకు శిక్షణను ఇప్పించారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి



శ్రీకాకుళం అర్బన్ : మొక్కలు పంపిణీ చేస్తున్న దానేటి



ఆమదాలవలస : మొక్కను నాటుతున్న రామ్మోహనరావు

శ్రీకాకుళం అర్బన్: ప్రతిఒక్కరూ ఒక మొక్క నాటాలని జనసేన నాయుకలు, ప్రముఖ గైనిక్ వైద్యనిపుణులు డాక్టర్ దానేటి శ్రీధర్ పిలుపునిచ్చారు. జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలకు సాధనలో భాగంగా వనమహోత్సవం పేరిట నగరంలోని సూర్యమహల్ కూడలిలో 500 మొక్కలను శనివారం పంపిణీ చేశారు. అలాగే యువతకు టీషర్టులను అందజేశారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ వాహన వినియోగం పెరిగిపోవడం, గ్లోబల్ వార్మింగ్‌తో వాతావరణంలో విపరీతమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన జీవనానికి మొక్కలు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కోరాడ సర్వేశ్వర రావు, గురుప్రసాద్, ఉదయ్, మణి, అర్జున్, కామేష్, మోహనలక్ష్మి, జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు.

ఆమదాలవలస: పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు అన్నారు. శనివారం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో భాగంగా వన మహోత్సవ కార్యక్రమం చేపట్టారు. పట్టణంలోని పాలపోలమ్మ గుడి దగ్గర రోడ్డుకు ఇరువైపులా జనసేన నాయకులతో కలిసి మొక్కలను నాటారు. కార్యక్రమంలో జనసేన నాయకులు మజ్జి రాంబాబు, శిర్లాపు గణేష్, గంగు కోటేష్, మాకాన సతీష్, తుంగాన తవిటి నాయుడు, దుల్ల సతీష్, వాసు నాయుడు, చింతాడ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం : మొక్కను అందిస్తున్న తహశీల్దార్ వెంకటరావు

టెక్కలి: జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కణితి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ డిగ్రీకళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ, జనసేన నాయకులు గవరయ్య, కుమారస్వామి, భాస్కరరావు, హరి, చందు, సోమేష్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

ఇచ్ఛాపురం : పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని తహశీల్దార్ వెంకటరావు అన్నారు. స్థానిక హెబ్రన్ మిస్సాను స్కూల్ ఆవరణలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణలో కాలుష్య నివారణకు మొక్కలు ఎంతో మేలు చేస్తాయని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జాన్ వెస్లి, సంతోష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సాయినగర్‌లో రహదారిపై నిలిచిన నీరు


రోడ్లు జలమయం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పురపాలక సంఘ పరిధిలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. శనివారం ఉదయం నుంచి పట్టణంలో కురుస్తున్న వర్షానికి పూజారిపేట, పాతినవారివీధి, కండ్రపేట, సాయి నగర్, బి.ఆర్.నగర్, మెట్టక్కివలస తదితర ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. రోడ్లపై నీరు నిలిచిపోవడంతో రాక పోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. పురపాలక సంఘం సిబ్బంది నీటిని దారి మళ్లించి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు.

గ్రంథాలయానికి పురస్కారం

ప్రజాశక్తి- లావేరు




మెమెంటో

స్థానిక శాఖా గ్రంథాలయాధికారి, సంఘ సేవకులు మురపాక శ్రీను వాసరావుకు ప్రతిష్టాత్మకమైన రవీంద్రరత్న పురస్కరం లభించింది గ్రంథాలయ రంగంతో పాటు సామాజిక సేవలో ఆయన చేస్తున్న సేవలను గుర్తిస్తూ రవీంద్రర్ నాథ్ ఠాగూర్ జ్ఞాపకార్థం కర్ణాటకలోని మెయిల్ ఫౌండేషన్ ఈ పురస్కారాన్ని ప్రకటించారు. ఫౌండేషన్ చైర్మన్ జాన్ దామాస్, అవార్డు ప్రధాన కమిటీసభ్యులు ఎన్.చంద్రశేఖర్‌లు పురస్కరాన్ని వర్చ్‌వల్ విధానంలో ప్రధానం చేశారు. ఈసందర్భంగా శ్రీనువాసరావును వారు అభినందించారు.

ప్రతిభా విద్యార్థినులకు చేయూత

ప్రజాశక్తి- టెక్కలి

మండలంలోని నర్సింగపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవతరగతిలో అత్యధిక మార్కులు సాధించి ట్రిపుల్‌ఐటిలో సీటు సంపాదించిన వజ్జల చైతన్య, దవళ ఝాన్సీలకు విశ్రాంత హెచ్ఎం మొదుగువలస గణపతిరావు ఆర్థికసాయం అందించారు. ఒక్కొక్క విద్యార్థినికి రూ.10వేలు చొప్పున నగదు పురస్కారాన్ని శనివారం అందించారు. ప్రతిభ కలిగిన విద్యార్థులు పేదరికంతో చదువుకు దూరం కాకూడదని గణపతిరావు అన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సోమేశ్వరరావు, ఉపాధ్యాయులు పాలవలస ధర్మారావు, రోణంకి విజయ్‌కుమార్, బడగల ప్రమీల, మల్లీశ్వరి, చిన్నవాడు, పాపారావు, వెంకటరమణ, శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



మందస : వినతిపత్రం అందజేస్తున్న భీమారావు

నేడు నిరసన

ప్రజాశక్తి -మందస

2004 సెప్టెంబరు ఒకటన సిపిఎస్ విధానం ప్రవేశపెట్టారని, దీంతో 20 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ఆదివారం పాత తాలూకా కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్నామని ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు గవ్వ భీమారావు తెలిపారు. ఈ సందర్భంగా మందసలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగి కాంట్రిబ్యూషన్ లేని పాత పెన్షన్ విధానం తప్పిస్తే మరేది తమకు ఆమోదయోగ్యం కాదని అన్నారు. ఉదయం 9.30 గంటలకు సోంపేట, కంచిలి, మందస మండలాల్లో చేపట్టనున్న నిరసన కార్యక్రమంలో పాల్గొని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షులు ఎస్.కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కె.సుందరరావు కార్యవర్గ సభ్యులు ఎస్.గణేశ్వరరావు, ఎం.చిత్రసేను, ఉపాధ్యాయులు ఎస్.అబ్రహం, పి.రాంబాబు, ఎం.దామోదరం, జి.గోపాలకృష్ణ, బి.రమేష్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: పాత తాలూకా కేంద్రం వద్ద ఆదివారం నిరసన తెలుపుతున్నామని ఎపిటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు పి.రమేష్‌బాబు, యస్.మురళీధర్‌లు, రాష్ట్ర కౌన్సిలర్లు ఎన్.నీలమోహన్, ఎన్.శ్రీనివాసరావులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాత తాలూకా కేంద్రం వద్దకు ఉదయం 10 గంటలకు హాజరు కావాలన్నారు.

టెక్కలి: సిపిఎస్ విధానాన్ని రద్దు చేస్తూ పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలని కోరుతూ ఆదివారం ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో పాత తాలూకా కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టనున్నామని మండల శాఖ అధ్యక్షులు బొడ్డేపల్లి నేతాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందిరాగాంధీ జంక్షన్ వద్ద నిర్వహించే ఈ కార్యక్రమానికి టెక్కలి, సంతబొమ్మాళి, నందిగాం మండలాల నుంచి ఉపాధ్యాయులు హాజరుకావాలని ప్రకటనలో కోరారు.

పని ఒకరిది... బిల్లు మరొకరిది

అధికారుల నిర్వాకంపై ఫిర్యాదు

ప్రజాశక్తి- పొందూరు

గత ప్రభుత్వంలో ప్రజాప్రతినిదులు, నాయకులు చెప్పిందే వేదంగా అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించి పనిచేసిన వారికి బిల్లు చెల్లించకుండా వేరొకరికి బిల్లు చెల్లించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని పెనుబర్తి పంచాయితీ అలమాజీపేటలో 2019లో టిడిపి ప్రభుత్వ హయాంలో పంచాయతీ తీర్మానంతో గ్రామానికి చెందిన టిడిపి నాయకులు బాడాన గిరి రోడ్డు పనులు చేపట్టారు. దీనికి ఆ ఏడాది మార్చిలో మొదటి బిల్లుగా రూ.4,50,771లు పంచాయతీ ఖాతాలో జమైంది. ఈ సమయంలో ప్రభుత్వం మారిపోగా చేసిన పనికి బిల్లు చెల్లించకపోవడంతో కోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు ఆదేశాల మేరకు బిల్లును చెల్లించారు. ఇదే పనికి సంబంధించి రెండవ బిల్లు సుమారు రూ.3.30 లక్షలు పెండింగ్‌లో ఉంది. వైసిపి ప్రభుత్వం రావడంతో వెండర్‌కోడ్ పద్ధతిని తీసుకురాగా, 2022లో పంచాయతీ కార్యవర్గం మారడంతో బిల్లు చెల్లించకుండా నిలిపివేశారు. అనంతరం నాయకుల ఆదేశాల మేరకు అధికారులు ఏమాత్రం ఆలోచించకుండా పనిచేసిన వారికి బిల్లు చెల్లించకుండా వెండర్ కోడ్‌ను టి.మురళీకృష్ణ పేరుతో మార్చారు. దీనిపై ఇంజనీరింగ్ అధికారులు, మండల అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఎంబుక్ చేయడంతో గత ఏడాది జూన్‌లో రెండవ బిల్లు రూ.3,24,939 పంచాయతీ ఖాతాలో పడింది. దీంతో ఈ మొత్తాన్ని పనిచేసిన బాడాన గిరికి కాకుండా టి.మురళీకృష్ణకు అధికారులు ఇచ్చేశారు. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో చేసిన పనికి రావాల్సిన పెండింగ్ బిల్లుపై గిరి దృష్టిపెట్టడంతో ఈ మొత్తాన్ని మురళీకృష్ణకు చెల్లించినట్లు తేలడంతో అవాక్కయ్యారు. దీంతో ఈ విషయంపై బాడాన గిరి, టిడిపి నాయకులు కూన వెంకట సత్యారావుతో కలిసి ఎంపిడిఒకు ఫిర్యాదు చేశారు. తాము చేసిన పనికి ఇతరులకు చెల్లించిన మొత్తాన్ని వెంటనే తిరిగి ఇవ్వకపోతే న్యాయపోరాటం చేస్తామని, దీనికి బాధ్యులైన అధికారులందరిపై కోర్టును ఆశ్రయిస్తామని హెచ్చిరించారు.



మాట్లాడుతున్న శైలజ

మాజీ సైనికుల సమస్యలపై దృష్టి

ప్రజాశక్తి- టెక్కలి

మాజీ సైనికోద్యోగుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి వారికి అండగా సంఘం నిలబడుతుందని జిల్లా సైనిక అధికారి శైలజ అన్నారు. శనివారం టెక్కలిలోని సైనికుల విశ్రాంత భవనాన్ని సందర్శించి మాజీ సైనిక ఉద్యోగులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం మంజూరు చేసే కార్డుల వినియోగంలో జరుగుతున్న అవకతవకలపై దృష్టి సారించి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు మాజీ ఉద్యోగులు కోరారు. ఈ సందర్భంగా పలు సందేహాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు సోమేశ్వరరావు, గోవింద రాజులు, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

కర్రసాము కళను పరిరక్షించాలి



కర్రసాము పోటీలను ప్రారంభిస్తున్న లక్ష్మీదేవి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పూర్వకాలంలో యుద్ధ కళల్లో ఒకటైన కర్రసాము నానాటికి అంతరించిపోతోందని, క్రీస్తు పూర్వం పుట్టిన కర్రసాము కళను నేటి పాలకులు పట్టించుకోవడం లేదని, క్రీడల్లో భాగమైన కర్రసాము కళను రేపటి తరానికి అందించాల్సిన అవసరాన్ని గుర్తించి కర్ర సామును పరిరక్షించాలని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పిలుపునిచ్చారు. ఆదివారం పేటలో ఉన్న ప్రహ్లాద కళ్యాణ మండపంలో రాష్ట్రస్థాయి సిలంబం పోటీలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీస్తు పూర్వమే కర్రసాము విద్య పుట్టిందని తెలిపారు. అప్పటి జీవన విధానం, అందుబాటులోని వనరుల ఆధారంగా శత్రువుల నుంచి ఆత్మ రక్షణకు తమిళనాడులో కర్రసాము పురుడు పోసుకుందన్నారు. కాలక్రమేణా కర్రసాముకు యుద్ధ ప్రాముఖ్యత తగ్గిపోయిందన్నారు. నేటికీ ఈ కళ కొన్ని గ్రామాల్లో సజీవంగా ఉన్నప్పటికీ ప్రాధాన్యత లేకుండా పోయిందని పేర్కొన్నారు. కర్రసాము సాధనతో ఆత్మరక్షణతో పాటు అధిక బరువు తగ్గడానికి, మడమలు, కీళ్లు, ఎముకల పటుత్వానికి, శరీరంలో రక్త ప్రసరణ సజావుగా సాగేందుకు, ఏకాగ్రత పెంచేందుకు ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. రెండురోజుల పాటు నిర్వహించనున్న ఈ పోటీలను నగర ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిలంబం జిల్లా ప్రతినిధులు డాక్టర్ బి.శివప్రసాద్, కె.సత్యశ్రీకాంత్, శ్యామ్‌సుందరరావు, వివిధ జిల్లాకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. వివిధ జిల్లాల నుంచి తొమ్మిది టీమ్‌లు పోటీలకు హాజరయ్యాయని చీఫ్ కోచ్ హర్షవర్ధన్ తెలిపారు.

ఎమ్మెల్యేల పరామర్శ



లావేరు : పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఇఆర్

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని అధపాక గ్రామానికి చెందిన దుక్క భాస్కరరావు ఇటీవల ప్రమాద వశాత్తు తలకు బలమైన గాయమై ఈనెల 16న బ్రెయిన్ డెడ్ అయి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు శనివారం ఆకుటుంబాన్ని పరామర్శించారు. మృతి చెందిన యువకుడు మరో నలుగురికి అవయవదానం చేసి ప్రాణదానం చేయడం గొప్ప విషయమన్నారు. పరామర్శించిన వారిలో టిడిపి మండల అధ్యక్షుడు ముప్పుడి సురేష్, మాజీ ఎంపిపి మీసాల వెంకటరమణ, మాజీ ఎఎంసి చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, చార్లెస్, కిలారి రామకృష్ణ తదితరులున్నారు.

పొందూరు: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం పారిశ్రామిక వాడలో ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన పట్టణానికి చెందిన ఉద్యోగి హంస ప్రశాంత్ కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శనివారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. కంపెనీ నుంచి రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు పూర్తిస్థాయిలో సకాలంలో అందేలా చూస్తానని మృతుని భార్య జ్యోతి, తల్లి సత్యవతికి, కుటుంబ సభ్యులకు ఆయన హామీ ఇచ్చారు. ఈయన వెంట టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, పట్టణ అధ్యక్షులు అనకాపల్లి శ్రీరంగనాయకులు, నాయకులు బాడాన శేషగిరి, శాంతారాం, పలువురు టిడిపి నాయకులు ఉన్నారు.



పొందూరు : పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్



సత్కరిస్తున్న ఆస్పత్రి ఉద్యోగులు

సేవలే గుర్తింపునిస్తాయి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పదవీ కాలంలో చేసిన సేవలే గుర్తింపు నిస్తాయని సర్వజన ఆస్పత్రి సూపరింటిండెంట్ డా.షకీలా అన్నారు. శనివారం పదవీ విరమణ పొందుతున్న ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్ జోగిగాజుకు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటిండెంట్ మాట్లాడుతూ ఆయన అందించిన సేవలను కొనియడారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఉద్యోలు పాల్గొన్నారు.

'సపక్ తక్రా' క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళంలో సెప్టెంబర్ 28, 29 తేదీల్లో నిర్వహించనున్న సపక్ తక్రా 34వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి ఛాంపియన్ షిప్ -2024 పోటీల్లో జిల్లా నుంచి పాల్గొనేందుకు జట్టు ఎంపిక శనివారం నగరంలోని ఎన్‌టిఆర్ మున్సిపల్ మైదానంలో జరిగింది. ఈఎంపిక పోటీలను సపక్ తక్రా అసోసియేషన్ చైర్మన్ ఎంఎస్ఆర్ కృష్ణమూర్తి ప్రారంభించారు. ఈ పోటీలను అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, కోచ్ జి.అర్జున్ రెడ్డి పర్యవేక్షించారు. జిల్లాస్థాయి జట్టుకు రెండు విభాగాల్లో 10 మంది మహిళలు 10 మంది పురుషులను ఎంపిక చేశారు. వీరిలో ఐదుగురు వంతున రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు వీలుంటుందని తెలిపారు. ఎంపిక పోటీల ప్రారంభ కార్యక్రమానికి వైస్ ప్రెసిడెంట్‌లు ఎస్‌విడి మురళి, పైడి శ్రీను, నక్క శంకర్, ఎం.విష్ణు, కొర్లయ్య, వేణుగోపాల్ రెడ్డి, అశోక్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.



ఎంపిక పోటీలో పాల్గొన్న క్రీడాకారులు

మట్టి విగ్రహాల పంపిణీ

సోంపేట : మండలంలోని గొనకపాడు పాఠశాలలో శనివారం స్థానిక జాగృతి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు రామ్‌బుడ్డి గణపతి విద్యార్థులకు మట్టి వినాయకుడి ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించని మట్టి ప్రతిమలని రానున్న వినాయక చవితి, దసరా ఉత్సవాల్లో ఉపయోగించాలని కోరారు. పర్యావరణానికి హాని కలిగించే రంగురంగుల ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసే ప్రతిమలను ఉపయోగించవద్దంటూ విద్యార్థులే ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం బాలకృష్ణ, ఉపాధ్యాయులు సింహాచలం, మేనకేతనరావు, కిషోర్, కార్తీక్ పాల్గొన్నారు.



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న గణపతిరావు

వయ్యారిభామతో జీవ వైవిధ్యానికి నష్టం

పలాస: ఎన్నిసార్లు పీకినా మళ్లీ మళ్లీ పెరిగి, వదలని వయ్యారిభామ కలుపు మొక్కలతో జీవ వైవిధ్యానికి నష్టం వాటిల్లు తుందని బ్రాహ్మణతర్ల హైస్కూల్ హెచ్ఎం ఎస్.వి.రమణారావు అన్నారు. శనివారం వయ్యారి భామ అవగాహన వారోత్స వాలు సందర్భంగా హైస్కూల్లో ప్రత్యేక లైఫ్ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలోని జాతీయ హరిత దళం క్లబ్, జూనియర్ రెడ్‌క్రాస్ క్లబ్‌ల ఆధ్వర్యాన విద్యార్థులు 'వయ్యారిభామ - వదలదు మామ' అనే నినాదంతో పాఠశాల ఆవరణలో పెరిగిన వయ్యారిభామ కలుపు మొక్కలను తొలగించారు. ఎన్‌జిసి క్లస్టర్ కో-ఆర్డినేటర్ కొయ్యల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఈశ్వరరావు, మధుబాబు, రమేష్, సుధాకుమారి, పద్మలోచనం, జనార్ధనరావు, పద్మ, చంద్రశేఖర్, యామిని, కిషోర్, రజనికుమారి, జ్యోతమ్మ, కృష్ణవేణి, చిన్నారావు, లక్ష్మీబాయ్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు



అవగాహన కల్పిస్తున్న ఎఒ నరసింహమూర్తి

పత్రకొండలో 'పొలంబడి'

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని పత్రకొండలో ఎఒ నరసింహమూర్తి ఆధ్వర్యాన శనివారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు సేంద్రీయ సాగు క్షేత్రస్థాయి ప్రయోగాలపై అవగాహన కల్పించారు. సేంద్రీయ పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు పొందడమే కాకుండా, మేలైన ఉత్పత్తులు పొందవచ్చు అన్నారు. కార్యక్రమంలో కుమారి, ప్రియాంక, బి.విశ్వనాథం, జగన్నాయకులు, షణ్ముఖరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.